డివిజన్ల వారీగా జవాన్ల నియామకం

- త్వరలోనే డివిజన్ల మార్పునకు అవకాశం

కార్పొరేషన్, ఫిబ్రవరి 2: కరీంనగర్ నగరపాలక సంస్థలోని 60 డివిజన్లకు 60 మంది జవాన్లను నియమిస్తూ అధికారులు నిర్ణయం తీసుకున్నారు. పాలకవర్గం ఉన్న సమయంలో పారిశుధ్య విభాగంలో పని చేస్తున్న పలువురు కార్మికులను పాలకవర్గంలోని పలువురు ప్రజాప్రతినిధులు తమ వ్యక్తిగత సహయకులుగా, ఇతర అవసరాల కోసం వినియోగించుకున్నారు. ఇలా ఉన్న వారందరిని నగరపాలక అధికారులు తిరిగి నగరపాలక విధుల్లో చేరాలంటూ ఆదేశాలు జారీ చేశారు. వీరందరిని ఆయా డివిజన్లకు జవాన్లుగా నియమిస్తూ కమిషనర్ ఉత్తర్వులు చేయగా, సోమవారం వారు విధుల్లో చేరే అవకాశాలు ఉన్నాయి. అయితే వీరిలో ఎంత మంది విధుల్లో చేరుతారన్నది ఇప్పుడు ఆసక్తిని రేకెత్తిస్తుంది. వీరిల్లో ఎక్కువగా ఆయా ప్రజాప్రతినిధుల వాహనాల డ్రైవర్లుగా కొనసాగుతున్నా వారే ఉన్నారు. వారు నగరపాలక పారిశుధ్య విభాగంలో ఏ మేరకు పని చేస్తారన్న వేచి చూడాల్సి ఉంది. ఇటీవల ప్రత్యేకాధికారిగా బాధ్యతలు స్వీకరించిన సమయంలోనే కలెక్టర్ పారిశుధ్య విభాగంలో సమూలంగా మార్పులు తీసుకురావాలని, బదిలీలు చేపట్టాలని అధికారులకు సూచనలు చేసినట్లు తెలుస్తోంది. ఆ మేరకు పారిశుధ్య విభాగంలో పూర్తిస్థాయిలో బదిలీలు జరిగే అవకాశం ఉందన్న చర్చ సాగుతున్నది.

మాజీ డిప్యూటీ మేయర్ దంపతులకు సన్మానం

మాజీ డిప్యూటీ మేయర్ దంపతులను సన్మానిస్తున్న కాలనీ ప్రజలు

కార్పొరేషన్, ఫిబ్రవరి 2: నగరంలోని 37వ డివిజన్‌కు చెందిన రాజీవ్ మెమోరియల్ క్లబ్, 37వ డివిజన్ వాసులు ఆదివారం మాజీ డిప్యూటీ మేయర్ చల్ల స్వరూపారాణీ హరిశంకర్ దంపతులను డివిజన్‌లో ఘనంగా సన్మానించారు. గజమాలవేసి, శాలువా కప్పి, పుష్పగుచ్ఛాన్ని అందించారు. ఈ సందర్భంగా మాజీ డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ, నగరంలోని 37వ డివిజన్ అంటే నగరంలో ప్రత్యేక స్థానం ఉండేలా కృషి చేశానని తెలిపారు. రానున్న రోజుల్లోనూ ప్రజల ఆశీర్వాదం కావాలని కోరారు. డివిజన్ సమస్యలు తమ దృష్టికి తీసుకువస్తే పరిష్కారానికి కృషి చేస్తానని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డివిజన్ ప్రజలు, నాయకులు పాల్గొన్నారు.

'లక్షల డప్పులు-వేల గొంతులు' విజయవంతం చేయాలి

డప్పులు పంపిణీ చేస్తున్న మాజీ కార్పొరేటర్ నక్క పద్మా కృష్ణ

కార్పొరేషన్/తెలంగాణచౌక్, ఫిబ్రవరి 2: హైదరాబాద్‌లో ఈనెల 7న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన లక్షల డప్పులు – వేల గొంతుల సాంస్కృతిక ప్రదర్శన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని 26వ డివిజన్ మాజీ కార్పొరేటర్ నక్క పద్మా కృష్ణ పిలుపునిచ్చారు. ఆదివారం స్థానిక గాంధీ చౌరస్తా వద్ద మాజీ కార్పొరేటర్ తన అత్తామామ నక్క లక్ష్మీహనుమంతు జ్ఞాపకార్థం 25 డప్పులను ఎమ్మార్పీఎస్ విభాగానికి అందించారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్, ఎంఎస్ఎఫ్, దళిత నాయకులు బెజ్జంకి అనిల్, దండు అంజయ్య, గోషికి శంకర్, సముద్రాల అజయ్, కామరపు శ్యామ్, దండు వరలక్ష్మి, నక్క లక్ష్మణ్, కొమ్ముల రాజమల్లు, జింక మల్లేశం, సంపత్తి అశోక్ తదితరులు పాల్గొన్నారు.

రేపటి నుంచి 'వికసిత్ భారత్'పై జాతీయ సదస్సు

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 2: శాతవాహన విశ్వవిద్యాలయం, అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో 'వికసిత్ భారత్@2047: ఇండియా విజన్ ఫర్ డెవలప్మెంట్' అంశంపై రెండు రోజుల జాతీయ సదస్సు మంగళవారం నుంచి ప్రారంభిస్తున్నట్లు సెమినార్ డైరెక్టర్ డాక్టర్ కోడూరి శ్రీవాణి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సదస్సుకు ముఖ్య అతిథిగా తెలంగాణ ఉన్నత విద్యా మండలి చైర్మన్ ప్రొఫెసర్ వీ బాలకిష్టారెడ్డి, శాతవాహన యూనివర్సిటీ ఉప కులపతి ఆచార్య ఉమేశ్ కుమార్, ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వ విద్యాలయ ఉపకులపతి ప్రొఫెసర్ అల్దాస్ జానయ్య, కాకతీయ విశ్వవిద్యాలయ పూర్వ ఉపకులపతి ప్రొఫెసర్ ఆర్ సాయన్న, కాకతీయ విశ్వవిద్యాలయ యూనివర్సిటీ కళాశాల ప్రిన్సిపాల్ సీనియర్ ఆచార్యులు ప్రొఫెసర్ సురేశ్ లాల్ హాజరు కానున్నారని తెలిపారు.

'కార్పొరేట్ అనుకూల బడ్జెట్ సవరించాలి'

తెలంగాణచౌక్, ఫిబ్రవరి 2: కేంద్ర బడ్జెట్ కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా ఉందని, దానిని పేద ప్రజలకు అనుకూల బడ్జెట్‌గా మార్చాలని సీపీఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి డిమాండ్ చేశారు. నగరంలోని పార్టీ కార్యాలయం ముకుందలాల్ మిశ్రా భవనంలో ఆదివారం జిల్లా కమిటీ సభ్యులతో కలిసి మాట్లాడారు. కేంద్ర బడ్జెట్‌లో 25.2 శాతం వడ్డీ చెల్లింపులకు కేటాయించడం ద్వారా దేశ ఆర్థిక పరిస్థితి ఏమిటో అర్థమవుతున్నదన్నారు. తెలంగాణ నుంచి ఇద్దరు కేంద్ర మంత్రులు, ఆరుగురు ఎంపీలు ఉన్నా కూడా రాష్ట్రానికి నిధులు తీసుకురావడంలో విఫలమయ్యారని ఆరోపించారు. కొత్తపల్లి–మనోహరాబాద్ రైల్వే లైన్ సాధించడంలో, ఈఎస్ఐ హాస్పిటల్, ట్రిపుల్ ఐటీ మంజూరు చేయించడంలో కరీంనగర్ ఎంపీ కేంద్ర హోంశాఖ మంత్రి బండి సంజయ్‌కుమార్ పూర్తిగా విఫలమయ్యారని విమర్శించారు. కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల పాలన కొనసాగిస్తున్నదని మండిపడ్డారు. బడ్జెట్‌లో మార్పులు చేసి పేదల సంక్షేమానికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో నాయకులు సత్యం, నరేశ్ పాల్గొన్నారు.

యూజీసీ మార్గదర్శకాలు రద్దు చేయాలి

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 2: దేశంలో కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకొస్తున్న యూజీసీ మార్గదర్శకాలను రద్దు చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజినీకాంత్ డిమాండ్ చేశారు. భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ శాతవాహన యూనివర్సిటీ మహాసభ ఆర్ట్స్ కళాశాలలో ఎస్ఎఫ్ఐ జెండా ఆవిష్కరణ కార్యక్రమం జిల్లా కార్యదర్శి గజ్జెల శ్రీకాంత్‌తో కలిసి నిర్వహించి, మాట్లాడారు. కేంద్ర బడ్జెట్లో విద్యారంగానికి తగిన ప్రాధాన్యత ఇవ్వకపోవడం సిగ్గుచేటన్నారు. దేశంలో, ఇటు రాష్ట్రంలో విద్యారంగ పరిస్థితి దారుణంగా తయారైందని అసహనం వ్యక్తం చేశారు. సరైన సమయానికి స్కాలర్‌షిప్ ఫీజు రీయింబర్స్‌మెంట్ రాక పేద విద్యార్థులు చదువులకు దూరమయ్యే పరిస్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం ఎస్ఎఫ్ఐ శాతవాహన యూనివర్సిటీ కమిటీ 21 మందితో ఎన్నుకున్నారు. నూతన అధ్యక్ష, కార్యదర్శులుగా చిట్యాల రాజు, ఇందురి రాకేశ్ ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు అరవింద్, విద్యార్థులు పాల్గొన్నారు.

రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా హుజూరాబాద్ వాసి

మాచర్ల రాజు గౌడ్

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 2: తెలంగాణ ఫొటో అండ్ వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడిగా హుజూరాబాద్‌కు చెందిన మాచర్ల రాజు గౌడ్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, ఫొటో, వీడియో గ్రాఫర్ల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానన్నారు. తన ఎన్నికకు సహకరించిన రాష్ట్ర అధ్యక్షుడు ఎస్‌కే హుస్సేన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సిరి రవన్న, కోశాధికారి మాధవరెడ్డి, కేదార్ రెడ్డి, హుజూరాబాద్ ఫొటో, వీడియో గ్రాఫర్స్ అసోసియేషన్ సభ్యులకు ధన్యవాదాలు తెలిపారు. రాజు ఎన్నికపై హుజూరాబాద్ అసోసియేషన్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.

నా డ్రైవింగ్ బాలేదా?

- అయితే 18004254321కి కాల్ చేయండి
- ఆర్టీసీ బస్సులకు టోల్‌ఫ్రీ నంబర్‌తో స్టిక్కర్లు

తిమ్మాపూర్, ఫిబ్రవరి 2: 'ఆమ్ ఐ డ్రైవింగ్ బ్యాడ్.. దెన్ కాల్ 18004254321'.. అంటూ జిల్లాలోని ఆర్టీసీ బస్సులన్నింటికీ సదరు సంస్థ టోల్‌ఫ్రీ నంబర్‌తో కూడిన స్టిక్కర్లు అంటించింది. జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల సందర్భంగా కలెక్టర్ పమేలా సత్పతి ఆదేశాల మేరకు ఆర్టీసీ, ఆర్టీఏ శాఖలు సంయుక్తంగా ఆర్టీసీ బస్సులకు టోల్‌ఫ్రీ నంబర్‌తో కూడిన స్టిక్కర్లను అతికించింది. వాహనం నడపడంలో డ్రైవర్లు ఏమైనా తప్పులు చేస్తే.. ఎవరైనా టోల్‌ఫ్రీ నంబర్‌కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయవచ్చని తెలిపింది. ఓవర్ స్పీడ్, రాష్ డ్రైవింగ్, ఓవర్‌టేక్, కటింగ్ వంటి ఫిర్యాదులు ఎక్కువగా కరీంనగర్ నుంచి హైదరాబాద్‌కు రాజీవ్ రహదారిపై బస్సులు నడిపే డ్రైవర్లపైనే వస్తున్నాయి. దీంతో అధికారులు రోజువారీగా నివేదిక ఆధారంగా సదరు డ్రైవర్లపై చర్యలు తీసుకునే అవకాశం ఉన్నది. ఈ క్రమంలో డ్రైవర్లు జాగ్రత్తగా వెళ్లే అవకాశం ఉన్నది. టోల్‌ఫ్రీ నంబర్‌ను కొనసాగించి.. స్టిక్కర్లను ఇంగ్లిష్‌తో పాటు తెలుగులో అంటిస్తే మరిన్ని ఫిర్యాదులు రావడంతోపాటు ప్రమాదాలు సంఖ్య తగ్గే అవకాశం ఉందని పలువురు ప్రయాణికులు వారి అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.

బస్సు వెనుక అతికించిన టోల్‌ఫ్రీ నంబర్ స్టిక్కర్

మాట్లాడుతున్న ఎమ్మెల్సీ అభ్యర్థి కూర రఘోత్తం రెడ్డి

ప్రైవేట్, కార్పొరేట్ శక్తులకు బలికావద్దు

- ఉపాధ్యాయుల మద్దతుతోనే బరిలో ఉంటున్నా
- ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి కూర రఘోత్తంరెడ్డి

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 2: ప్రైవేట్, కార్పొరేట్ శక్తులకు ఉపాధ్యాయులు బలికావద్దని, హైదరాబాద్, రంగారెడ్డిలో జరిగిన సంఘటనలు పునరావృతం కావద్దని కరీంనగర్, నిజామాబాద్, మెదక్, ఆదిలాబాద్ ఉపాధ్యాయ నియోజకవర్గ ఎమ్మెల్సీ అభ్యర్థి, మాజీ ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి పేర్కొన్నారు. కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఓ హోటల్‌లో ఆదివారం అధ్యాపక జేఏసీ, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం, తెలంగాణ పీఆర్టీయూ ఉమ్మడి మద్దతుతో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దశాబ్దకాలంగా విద్య, ఉపాధ్యాయరంగ సేవలో నిమగ్నమైన అభ్యర్థిగా తనను ఎన్నుకోవాలని, కార్పొరేట్, రియల్ఎస్టేట్ అభ్యర్థులకు అవకాశం ఇస్తే వారు విద్యా వ్యవస్థ గురించి ఎలా ఆలోచిస్తారో ఉపాధ్యాయులు అర్థం చేసుకోవాలని చెప్పారు. విద్యారంగంపై అనుభవం ఉన్న తనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని కోరారు. రాష్ట్రంలోని ఉపాధ్యాయులు, ఉపాధ్యాయుల సంఘాల పూర్తి మద్దతు బరిలో ఉంటున్నట్లు చెప్పారు. ఇక్కడ అధ్యాపక జేఏసీ అధ్యక్షుడు మధుసూదన్‌రెడ్డి, రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు పర్వతరెడ్డి, సదానందం, తెలంగాణ పీఆర్టీయూ అధ్యక్షుడు పార్వతి సత్యనారాయణ, నాయకులు పాతూరి రాజిరెడ్డి, కనకయ్య, రాజేశ్‌నాయక్, సత్యనారాయణగౌడ్, ఆనందం, పీఆర్ శ్రీనివాస్, గోనె శ్రీనివాస్, ఆటసదయ్య, చొల్లేటి శ్రీనివాస్, గజేందర్, సాబీర్ అలీ తదితరులు ఉన్నారు.

సేవా భావంతో వైద్యమందించాలి

- ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి

శంకరపట్నం, ఫిబ్రవరి 2: దవాఖానలు రోగుల పట్ల సేవాభావంతో పని చేయాలని ఎమ్మెల్యే డాక్టర్ కవ్వంపల్లి సత్యనారాయణ సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో హోమియో కేర్ క్లినిక్‌ను ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఇటీవల హోమియో, ఆయుర్వేద వైద్య పద్ధతులు గ్రామీణ ప్రాంతాల్లోని రోగులకు చేరువ కావడం ఆహ్వానించదగ్గ పరిణామమని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ బత్తిని శ్రీనివాస్‌గౌడ్, ఏఎంసీ వైస్ చైర్మన్ తిరుపతి, డైరెక్టర్లు తనుకు ప్రభాకర్, గాజుల వెంకటేశ్వర్లు, కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు బసవయ్య, నాయకులు గట్టు తిరుపతి, బండారి తిరుపతి, ఊకంటి మధూకర్, జనగాం శ్రీనివాస్, సదానందం, హిసామొద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

'ఉపాధి హామీ'ని విస్మరించిన బడ్జెట్

శంకరపట్నం, ఫిబ్రవరి 2: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన తాజా బడ్జెట్ పేదల ఆకలి తీర్చే ఉపాధిహామీ పథకాన్ని చిన్న చూపు చూసిందని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వడ్ల రాజు విమర్శించారు. ఆదివారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడారు. ఉపాధిహామీ పథకానికి బడ్జెట్‌లో కేటాయింపులు పెంచకపోవడం సరికాదని ఆగ్రహం వ్యక్తం చేశారు.

పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి ముందుంటా

- పాత్రికేయుల సమావేశంలో అల్ఫోర్స్ చైర్మన్ నరేందర్ రెడ్డి

రాంనగర్, ఫిబ్రవరి 2: పట్టభద్రుల సమస్యలు పరిష్కరించేందుకు తాను ఎల్లవేళలా ముందుంటానని ఎమ్మెల్సీ కాంగ్రెస్ అభ్యర్థి అల్ఫోర్స్ విద్యాసంస్థల చైర్మన్ వీ నరేందర్ రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం కరీంనగర్ జిల్లా కేంద్రంలోని ఎమ్మెల్సీ క్యాంపు కార్యాలయంలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ. ఉత్తర తెలంగాణలో కరీంనగర్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు పాటుపడుతామని పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రకటించిన జాబ్ క్యాలెండర్ అమలుకు కృషి చేస్తానన్నారు. కార్యక్రమంలో సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ ఆకారి భాస్కర్ రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆరెపల్లి మోహన్, మాజీ కార్పొరేటర్లు చాడగొండ బుచ్చి రెడ్డి, కాశెట్టి శ్రీనివాస్, శ్రావణ్ నాయక్, మునిగంటి అనిల్, ఫహాద్, గండి రవీందర్, వెన్నం రజిత రెడ్డి, షబానా, శరణ్య, పలువురు నాయకులు పాల్గొన్నారు.

మైనార్టీల సంక్షేమానికి కృషి

- పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి సర్దార్ రవీందర్ సింగ్

కార్పొరేషన్, ఫిబ్రవరి 2: మైనార్టీల సంక్షేమానికి, అభివృద్ధికి కృషి చేస్తానని మాజీ మేయర్, రాష్ట్ర సివిల్ సప్లయ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్, కరీంనగర్, మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల అభ్యర్థి సర్దార్ రవీందర్‌సింగ్ హామీఇచ్చారు. జిల్లా కేంద్రంలోని కశ్మీర్‌గడ్డ లోని మెట్రో ఫంక్షన్‌హాల్ వద్ద హ్యూమన్ ఫస్ట్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఆదివారం ఎమ్మెల్సీ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా రవీందర్‌సింగ్ మాట్లాడుతూ, మైనార్టీ పట్టభద్రుల సమస్యల పరిష్కారానికి తనవంతు కృషి చేస్తానన్నారు. తనకు మండలిలో అవకాశం ఇస్తే.. పట్టభద్రుల హక్కుల కోసం పోరాడుతానన్నారు. తనకు మొదటి ప్రాధాన్యత ఓటేసి భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కాగా, రవీందర్‌సింగ్‌కు మైనార్టీలు మద్దతు ప్రకటించారు.

నేటి నుంచి ప్రజావాణి రద్దు

కలెక్టరేట్, ఫిబ్రవరి 2: శాసనమండలి ఎన్నికల కోడ్ ముగిసేవరకు ప్రతి సోమవారం జరుగాల్సిన ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ పమేలా సత్పతి ఆదివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జిల్లాలోని ప్రజలంతా ఈ విషయాన్ని గమనించాలని విజ్ఞప్తి చేశారు. ఎన్నికలు ముగిసిన తర్వాత యథావిధిగా ప్రజావాణి కొనసాగుతుందని వెల్లడించారు.

సదరం శిబిరాల నిలుపుదల

కలెక్టరేట్, ఫిబ్రవరి 2: దివ్యాంగుల పెన్షన్ మంజూరుకు అంగవైకల్య నిర్ధారణ కోసం జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో నేటి నుంచి జరుగాల్సిన సదరం శిబిరాలను నిలిపివేసినట్లు జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ అధికారి వి.శ్రీధర్ తెలిపారు. సదరం వెబ్‌సైట్‌లో యూడీఐడీ కార్డుల జనరేషన్‌లో భాగంగా తాత్కాలికంగా సైట్ పనిచేయడం లేదన్నారు. దీంతో, సోమ, మంగళవారాల్లో నిర్వహించాల్సిన ఆర్థో శిబిరంతో పాటు 6, 10, 13వ తేదీల్లో నిర్వహించే మానసిక రోగులు, కంటిచూపు, మూగ, వినికిడి నిర్ధారణ శిబిరాలు వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. తిరిగి నిర్వహించే తేదీలు త్వరలో తెలపనున్నట్లు, ఆదివారం విడుదల చేసిన ప్రకటనలో వెల్లడించారు.

ఈతకు వెళ్లి.. నీట మునిగి

- అంకుషాకుంటలో పడి బాలుడి మృతి
- కందుగులలో విషాదం

వెంకటసాయి (ఫైల్)

హుజూరాబాద్ రూరల్, ఫిబ్రవరి 2: తోటి స్నేహితులతో కలిసి ఆ బాలుడు స్థానిక కుంటలో ఈతకు వెళ్లాడు. ఈ క్రమంలో ఈత రాకపోవడంతో నీటమునిగి.. ఊపిరాడక అక్కడిక్కడే మృతి చెందాడు. ఈ విషాదకర ఘటన హుజూరాబాద్ మండలం అంబేద్కర్ కాలనీ (కందుగుల)లో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. అంబేద్కర్ కాలనీకి చెందిన మచ్చ రాజ్‌కుమార్–సరిత దంపతుల పెద్ద కుమారుడు వెంకటసాయి (12) కందుగుల గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఆరో తరగతి చదువుతున్నాడు. ఆదివారం సెలవు కావడంతో తన సోదరుడు, స్నేహితులతో కలిసి గ్రామ సమీపంలోని అంకుషాకుంటలోకి ఈతకు వెళ్లాడు. ఈత రాకపోవడంతో వెంకటసాయి నీళ్లలో మునిగిపోగా, మిగతా స్నేహితులు భయంతో ఇంటికి వెళ్లారు. కుటుంబ సభ్యుల సమాచారం మేరకు అగ్నిమాపకశాఖ అధికారులు ఘటనా స్థలానికి చేరుకోగా, అప్పటికే వెంకటసాయి మృతి చెందాడు. ఈ క్రమంలో వారు మృతదేహాన్ని వెతికితీశారు. వెంకటసాయి తండ్రి ఫిర్యాదు మేరకు టౌన్ సీఐ తిరుమల్ గౌడ్ కేసు దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

పీఆర్సీ నివేదిక అమలు చేయాలి

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 2 : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయ పెన్షనర్లకు వేతనాల పెంపుపై 2023లో వేసిన పీఆర్సీ కమిషన్ నివేదిక తెప్పించి అమలు చేయాలని డీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీ రాజిరెడ్డి ప్రభుత్వాన్ని కోరారు. కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ కళాశాలలో డీటీఎఫ్ కరీంనగర్ జిల్లా శాఖ అధ్యక్షుడు ఆవాల నరహరి అధ్యక్షతన ఆదివారం జరిగిన జిల్లా శాఖ మధ్యంతర కౌన్సిల్, రాష్ట్ర పూర్వ కార్యదర్శి కోహెడ చంద్రమౌళి ఉద్యోగ విరమణ అభినందన సమావేశంలో రాజిరెడ్డి ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. పెరుగుతున్న జీవన వ్యయాలకు అనుగుణంగా ఉద్యోగులకు వేతన సవరణ చేయాలన్నారు. డీటీఎఫ్ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు ఎం రఘుశంకర్ రెడ్డి మాట్లాడుతూ, గత మార్చి నుంచి ఉద్యోగ విరమణ పొందిన వారికి రావాల్సిన రిటైర్మెంట్ ప్రయోజనాలకు సంబంధించిన బిల్లులు, ఉపాధ్యాయులకు సంబంధించిన సుదీర్ఘ కాలంగా పెండింగ్లో ఉన్న అన్ని బిల్లులను విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు పల్కల ఈశ్వర్ రెడ్డి, ఆవాల నరహరి, తూముల తిరుపతి పెద్ద సంఖ్యలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీరు బాటిల్ పగులగొట్టి.. గొంతు కోసి

- వ్యక్తిగత విషయాలు బయట పెడతాడేమోనని యువకుడి హత్య

మహేశ్(ఫైల్)

రాంనగర్, ఫిబ్రవరి 2: తన వ్యక్తిగత విషయాలు బయట పెడతాడేమోనని ఓ వ్యక్తిని బీర్ బాటిల్ పగులగొట్టి గొంతుకోసి దారుణంగా హత్య చేశాడు. కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్‌లో ఆదివారం రాత్రి జరిగిన ఈ ఘటన సంచలనం సృష్టించింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన బెజ్జంకి మహేశ్(24), అదే గ్రామానికి చెందిన కాల్వ సతీశ్ స్నేహితులు. అయితే, గతంలో జరిగిన తన వ్యక్తిగత విషయాలను బహిర్గతం చేస్తాడేమోనని మహేశ్‌పై సతీశ్ అనుమానం పెంచుకున్నాడు. ఎలాగైనా మహేశ్‌ను హతమార్చాలని పథకం ప్రకారం మరో స్నేహితుడితో కలిసి ఆదివారం అతడిని పిలిపించాడు. గ్రామ శివారులోని వైన్‌షాప్ వద్దకు మద్యం తాగేందుకు వెళ్లారు. మద్యం సేవించిన తర్వాత తన వ్యక్తిగత విషయాల గురించి ఎందుకు మాట్లాడుతున్నావు అని మహేశ్‌తో సతీశ్ దూషణకు దిగాడు. అదే సమయంలో తన దగ్గర ఉన్న బీర్ బాటిల్‌ను పగులగొట్టి మహేశ్ గొంతు కోసి దారుణంగా హత్య చేశాడు. తర్వాత నిందితుడు పరారీ కాగా, వారితో ఉన్న మరో వ్యక్తి పోలీసులకు సమాచారం అందించాడు. ఘటనా స్థలాన్ని రూరల్ ఏసీపీ శుభం ప్రకాశ్ పరిశీలించగా, కరీంనగర్ రూరల్ సీఐ ప్రదీప్ కుమార్ దర్యాప్తు చేపట్టారు.

'మానేరు'లో ముగిసిన క్రీడా పోటీలు


ఖోఖోలో తలపడుతున్న క్రీడాకారులు

కొత్తపల్లి, ఫిబ్రవరి 2 : కరీంనగర్‌లోని మానేరు విద్యాసంస్థల్లో మూడు రోజులుగా మానేరు ఖేల్ కుద్ 2025 పేరిట నిర్వహిస్తున్న వార్షిక క్రీడా పోటీలు ఆదివారంతో ముగిశాయి. ఈ సందర్భంగా విద్యార్థులకు ఖోఖో, కబడ్డీ, వాలీబాల్, చెస్, క్యారం, అథ్లెటిక్స్, జూడో తదితర క్రీడాంశాల్లో పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మానేరు విద్యాసంస్థల అధినేత కడారి అనంతరెడ్డి మాట్లాడుతూ, క్రీడారంగంలో రాణించిన వారు అన్ని రంగాల్లో ఎదుగుతారని పేర్కొన్నారు. కార్యక్రమంలో మానేరు విద్యాసంస్థల డైరెక్టర్ కడారి సునీతా రెడ్డి, ప్రిన్సిపాల్స్ రాజు చాకో, సరితారెడ్డి, పీఈటీలు సిలివేరి మహేందర్, తిరుపతి, జహేదా, స్వామి, శిరీషతో పాటు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

వెంకన్న బ్రహ్మోత్సవాలకు వేళాయె..

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 2 : జిల్లా కేంద్రంలోని మార్కెట్ రోడ్డులో గల శ్రీలక్ష్మీ పద్మావతీ సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయం వార్షిక బ్రహ్మోత్సవాలకు ముస్తాబైంది. ఈ నెల 3 నుంచి 9వ తేదీ వరకు ఉత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామని ఆలయ ఈవో కె సుధాకర్ తెలిపారు. ప్రధానంగా 7న శ్రీదేవీ భూదేవీ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామి, శ్రీ లక్ష్మీనారాయణుల కల్యాణ మహోత్సవం నిర్వహించనున్నట్లు చెప్పారు. 10న మార్క్‌ఫెడ్ మైదానం నుంచి నిర్వహించే శోభాయాత్రతో ఉత్సవాలు ముగుస్తాయని తెలిపారు. ప్రతి రోజూ నిర్వహించే కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

సేవల కోసం సిద్ధమైన ప్రతిమలు

నేడు జిల్లాకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

కార్పొరేషన్, ఫిబ్రవరి 2: కరీంనగర్ జిల్లా కేంద్రంలో సోమవారం ఉదయం 10:30 గంటలకు ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత రానున్నట్లు బీఆర్ఎస్ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. కోతిరాంపూర్‌లోని జ్యోతీరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి, అనంతరం కమాన్ చౌరస్తా వద్ద కమాన్ ఫార్మసీని ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

వర్గీకరణను వెంటనే అమలు చేయాలి

హుజూరాబాద్ టౌన్, ఫిబ్రవరి 2: ఈ నెల 7న హైదరాబాద్‌లో జరిగే లక్షల డప్పులు– వేల గొంతులు మాదిగల సాంస్కృతిక కళాప్రదర్శన గోడ ప్రతులు, కరపత్రాలను ఆదివారం పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో 'లక్ష డప్పులు– వేల గొంతులు' హుజూరాబాద్ మండలాధ్యక్షుడు ఎర్ర శ్రీధర్ ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎస్సీ కార్పొరేషన్ మాజీ చైర్మన్ బండ శ్రీనివాస్ మాట్లాడుతూ, సుప్రీంకోర్టు తీర్పు మేరకు ఎస్సీ వర్గీకరణను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సామాజిక కార్యకర్త వర్ధినేని రవీందర్ రావు, ఎంఎస్పీ రాష్ట్ర నాయకుడు మారేపల్లి శ్రీనివాస్, జిల్లా అధ్యక్షుడు తునికి వసంత్, 'లక్షల డప్పులు–వేల గొంతులు' హుజూరాబాద్ డివిజన్ అధ్యక్షురాలు ఆకినపల్లి శిరీష, డివిజన్ ఇన్‌చార్జి తుంగ ఆంజనేయులు, తదితరులు, డప్పు కళాకారులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలను పరామర్శించిన జీవీఆర్

రాఘవాపూర్‌లో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న జీవీ రామకృష్ణారావు

మానకొండూర్ రూరల్, ఫిబ్రవరి 2: మండలంలో ఇటీవల మృతిచెందిన వారి కుటుంబ సభ్యులను ఆదివారం బీఆర్ఎస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు పరామర్శించారు. అన్నారం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ రాజనర్సు తండ్రి వెంకటయ్య, పూదరి శ్రీకాంత్ గౌడ్ తండ్రి పూర్ణయ్య, రాఘవాపూర్ గ్రామానికి చెందిన రుద్రోజు శ్రీనివాస్ సతీమణి గౌతమి ఇటీవల వేర్వేరు కారణాలతో మృతి చెందగా, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ, బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు తాళ్లపల్లి శేఖర్ గౌడ్, బీఆర్ఎస్వీ మండలాధ్యక్షుడు రాయికంటి కిరణ్ కుమార్, నాయకులు పురం అనిల్ కుమార్, దాడి సతీశ్, మార్క శ్రీనివాస్ గౌడ్, శంకర్, చిట్యాల శ్రీనివాస్, బత్తిని శ్రీనివాస్ గౌడ్, బొద్దిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి, అట్ల ఆంజనేయులు, గ్రామస్తులు ఉన్నారు.

ఇంటికో డప్పుతో తరలి రావాలి

శంకరపట్నం, ఫిబ్రవరి 2: మాదిగ జాతి బిడ్డలు ఇంటికో డప్పుతో హైదరాబాద్‌లో సాంస్కృతిక ప్రదర్శన ర్యాలీకి తరలి రావాలని ఎంఆర్‌పీఎస్ నాయకులు పిలుపునిచ్చారు. ఎస్సీ వర్గీకరణను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ.. ఈ నెల 7న ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'లక్షల డప్పులు.. వేల గొంతులు' సాంస్కృతిక ర్యాలీ పోస్టర్లను ఆదివారం మండల కేంద్రంలో విడుదల చేశారు. మాదిగ బిడ్డలు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు కోడూరి మహేశ్ మాదిగ, ఆడెపు నర్సయ్య మాదిగ, చల్లూరి రాజేందర్ మాదిగ, కలకోట సమ్మయ్య మాదిగ, దాసారపు భద్రయ్య మాదిగ, కోండ్ర రాజయ్య మాదిగ, కనకం శంకర్ మాదిగ, సముద్రాల సంపత్ మాదిగ, మేరుగు శ్రీనివాస్ మాదిగ, మేకల కుమార్ మాదిగ, అంతడ్పుల సతీశ్ మాదిగ, బొజ్జ చంద్రమౌళి మాదిగ తదితరులు పాల్గొన్నారు.

రిటైర్‌మెంట్ బెనిఫిట్స్ చెల్లించకుంటే పోరాటమే

కలెక్టరేట్, ఫిబ్రవరి 2: విరమణ పొందిన ఉద్యోగులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించకుంటే పోరాటం తప్పదని తెలంగాణ విశ్రాంత ఉద్యోగుల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్ష,కార్యదర్శులు కె.వెంకటేశ్వర్లు, ఎం.రాజమల్లు స్పష్టం చేశారు. ఆదివారం నగరంలోని కోర్టు సమీపంలో గల ఆ సంఘం జిల్లా శాఖ కార్యాలయంలో నిర్వహించిన విశ్రాంత ఉద్యోగుల సమావేశంలో వారు మాట్లాడుతూ, ఏడాదికాలంగా ఉద్యోగ విరమణ ప్రయోజనాలు చెల్లించకుండా రాష్ట్ర ప్రభుత్వం విశ్రాంత ఉద్యోగులను మానసిక వేదనకు గురిచేస్తున్నదని ఆరోపించారు. రిటైర్ అయిన నెలలోపే తమకు చెల్లింపులు చేయాల్సి ఉండగా, ఇప్పటికీ ఖజానా శాఖకు నిధులు విడల్చకపోవడం శోచనీయమన్నారు. సమస్యను ప్రభుత్వం పట్టించుకోనట్లు వ్యవహరించడంతో విశ్రాంత ఉద్యోగులు తీవ్ర మనోవేదనకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తాము హక్కుగా పొందాల్సిన ప్రయోజనాలను అధికార నేతలతో పైరవీల ద్వారా పొందాల్సి వస్తున్నదని వాపోయారు. సమావేశంలో విశ్రాంత ఉద్యోగులు రాజమనోహర్‌రావు, వెంకటయ్య, సుదగోని రాజేశం, బైరి శ్రీశైలం, వెగ్గలం శ్రీహరి, ఇరుగురాల సదానందం, వొద్దమల వినోద్‌కుమార్ పాల్గొన్నారు.

పీటీఐ జిల్లా కమిటీ అధ్యక్షుడిగా లక్ష్మణ్

కమాన్‌చౌరస్తా, ఫిబ్రవరి 2 : జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న పార్ట్‌టైమ్ ఇన్‌స్ట్రక్టర్ విభాగం పరిధిలోని ఆర్ట్, వర్క్ ఎడ్యుకేషన్, పీఈటీ, సంగీతం, డ్యాన్స్ ఉపాధ్యాయుల ప్రత్యేక సమావేశం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఓల్డ్ హైస్కూల్లో ఆదివారం నిర్వహించారు. దీనికి ముఖ్య అతిథిగా పీటీఐల సంఘం రాష్ట్ర నాయకుడు దండు అశోక్ హాజరు కాగా, ఆయన సమక్షంలో సంఘం జిల్లా అధ్యక్షుడిగా మానకొండూర్‌కు చెందిన ఆర్ట్ టీచర్ మద్దెల లక్ష్మణ్‌తో పాటు జిల్లాలోని 16 మండలాల అధ్యక్షులను ఎన్నుకున్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకులు, సిద్దిపేట జేఏసీ అధ్యక్షుడు మహేంద్రా చారి, సిరిసిల్ల జేఏసీ అధ్యక్షురాలు నీరజ, పెద్దపల్లి జేఏసీ అధ్యక్షుడు పిల్లి రమేశ్, జగిత్యాల జిల్లా జేఏసీ పీటీఐ అధ్యక్షుడు సురేశ్ పాల్గొన్నారు.

ఎస్‌సీడీసీ ఆధ్వర్యంలో విహారయాత్ర

కలెక్టరేట్, ఫిబ్రవరి 2 : జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో జిల్లాలోని పలు సంక్షేమ వసతి గృహాల విద్యార్థులు ఆదివారం విహారయాత్రకు తరలివెళ్లారు. వసంత పంచమిని పురస్కరించుకుని బాసర పుణ్యక్షేత్రంలో గల సరస్వతీ మాతను దర్శించుకునేందుకు మూడు బస్సుల్లో వంద మంది విద్యార్థులతో పాటు ఏఎస్‌డబ్ల్యూవో, హాస్టల్ వెల్ఫేర్ అధికారులు, నాలుగో తరగతి ఉద్యోగులు వెళ్లారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ ఇన్‌చార్జి ఉపసంచాలకుడు నాగార్జున జెండా ఊపి, విహారయాత్ర బస్సులను ప్రారంభించారు. కార్యక్రమంలో జిల్లా యువజన అధికారి ఎం.వెంకటరాంబాబు, షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బి-సాట్ స్కాలర్‌షిప్ పరీక్షకు స్పందన

కరీంనగర్ రూరల్, ఫిబ్రవరి 2 : కరీంనగర్‌లోని బిర్లా ఓపెన్ మైండ్స్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో ఆదివారం బి–సాట్ 2025 స్కాలర్‌షిప్ పరీక్షను నిర్వహించారు. ఈ పరీక్షకు దాదాపు 400 మంది విద్యార్థినీ విద్యార్థులు హాజరయ్యారు. ఈ సందర్భంగా పాఠశాల చైర్మన్ దాసరి ప్రశాంత్‌రెడ్డి మాట్లాడుతూ, విద్యార్థుల్లో ప్రతిభను గుర్తించి చేయూతనందించేందుకే ఈ స్కాలర్‌షిప్ పరీక్ష నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ బబితా విశ్వనాథన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఉన్నత విద్యతోపాటు ఐఏఎస్ కోచింగ్ అందిస్తాం

అమిగోస్ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ ముస్కు రమణారెడ్డి

హౌసింగ్‌బోర్డుకాలనీ, ఫిబ్రవరి 2: పేద విద్యార్థులకు అండగా నిలుస్తామని, ఉన్నత విద్యతోపాటు ఐఏఎస్ కోచింగ్ అందిస్తామని అమిగోస్ ఐఏఎస్ అకాడమీ చైర్మన్ ముస్కు రమణారెడ్డి వెల్లడించారు. ఆదివారం ఆయన కరీంనగర్‌కు విచ్చేసిన సందర్భంగా, ప్రతిమ మల్టీప్లెక్స్‌లో గిరిజన సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా రమణారెడ్డి మాట్లాడుతూ, అకాడమీలో ఇప్పటికే ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ఐఏఎస్, ఐపీఎస్ కోచింగ్ ఇస్తున్నట్లు తెలిపారు. తాను పుట్టిన కరీంనగర్ గడ్డ నుంచి అనేక మంది ఐఏఎస్‌లను తయారు చేయడానికి కృషి చేస్తానన్నారు. పేదవాళ్లకు ఆర్థిక సాయం తన స్వచ్ఛంద సంస్థ నుంచి ఆర్థిక సహాయం అందిస్తానన్నారు. తన అకాడమీలో చాలామంది లంబాడీ, ఎస్సీ, మైనార్టీ విద్యార్థులకు ఉచిత విద్యనందిస్తున్నట్లు తెలిపారు. గిరిజన విద్యార్థి యువ సమితి రాష్ట్ర అధ్యక్షుడు రవి నాయక్ మాట్లాడుతూ, చైర్మన్ రమణారెడ్డి చేస్తున్న కృషికి గానూ గిరిజన సంఘాలు అండగా నిలుస్తాయన్నారు. అనంతరం పలువురు గిరిజన సంఘాల నాయకులు రమణారెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో యాదగిరి నాయక్, సురేశ్ నాయక్, రాజ్‌కుమార్ నాయక్ పాల్గొన్నారు.